సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 27 । నవంబర్ । 2023

పేదల భూములు లాక్కొంటున్నారు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ ఎంపీ బృందా కారత్



మాట్లాడుతున్న బృందా కారత్

ఇబ్రహీంపట్నం: పేదల భూములు లాక్కొని విషం విరజిమ్మే ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎంపీ బృందా కారత్ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పార్టీ అభ్యర్థి పగడాల యాదయ్య తరఫున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో కుమ్మక్కై పేద, దళిత, ఆదివాసులకు చెందిన వేలాది ఎకరాలు గుంజుకుంటున్నారని ఆరోపించారు. వారికి 2013 చట్ట ప్రకారం కూడా నష్టపరిహారం చెల్లించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం స్థానిక నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. ఇష్టానుసారంగా భూములు లాక్కుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. అదానీ, అంబానీల కోసం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తే తిప్పికొట్టామని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే బీజేపీ పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని పేర్కొన్నారు. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్ల జాడే లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్మిక, కర్షక, ప్రజానీకానికి ఎర్ర జెండా అండగా నిలబడుతుందన్నారు. ఇబ్రహీంపట్నం నుంచి పగడాల యాదయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నమ్మించి మోసం చేసింది

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మీర్‌పేట్: ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ తమను నమ్మించి మోసం చేసిందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ, బాలాపూర్ చౌరస్తాలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాదిగలను మోసం చేసిందన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పష్టమైన హామీ ఇచ్చిందని చెప్పారు. ఆ మేరకు కమిటీ ఏర్పాటు చేసి, వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. దళితులను కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేస్తే.. బీజేపీ వారికి అండగా నిలిచిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. దళిత ముఖ్యమంత్రిని చేస్తానని సీఎం కేసీఆర్ మోసం చేశారని, మంత్రి వర్గంలో కనీస ప్రాధాన్యత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి.. ఇవ్వకుండా మోసం చేశారని, ప్రశ్నించినందుకు తనపై కేసులు నమోదు చేయించి జైలుకు పంపారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని, ఆ మేరకు ప్రక్రియను కూడా ప్రారంభించిందని చెప్పారు. బలహీన వర్గాలకు చెందిన అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ రోడ్ షోలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు భీంరాజు, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.




మరో రెండు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగియనున్న నేపథ్యంలో.. ఒక రోజు ముందుగానే నగరంలో బీజేపీ భారీ రోడ్‌షో చేపట్టనుంది. ప్రచారం ఫైనల్ టచ్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ సోమవారం సాయంత్రం నగరంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి సాయంత్రం 5 గంటలకు రోడ్ షో చేపట్టనున్నారు. టివోలీ హోటల్, నారాయణగూడ ఫ్లై ఓవర్, వైఎంసీఏ మీదుగా కాచిగూడలోని వీరసావర్కర్ చౌరస్తాకు చేరుకోనుంది. గ్రేటర్ పరిధిలోని 24 మంది బీజేపీ అభ్యర్థులతో పాటు సుమారు లక్ష మంది ర్యాలీలో పాల్గొనే అవకాశం ఉంది. –సాక్షి, సిటీబ్యూరో

హాజరుకానున్న 24 మంది బీజేపీ అభ్యర్థులు

- లక్ష మందికిపైగా పార్టీ శ్రేణులు పాల్గొనే అవకాశం
- కాషాయమయం కానున్న భాగ్య నగరం
- ప్రధాని పర్యటనకు భారీగా బలగాల మోహరింపు
- ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

నేడు మోడీ షో

ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి నారాయణగూడ, వైఎంసీఏ, వీరసావర్కర్ చౌరస్తా వరకు రోడ్ షో





మోదీ.. ఆజ్ గ్రేటర్ ఆవాజ్

2 కి.మీ మేర రోడ్ షో.. కాచిగూడలో ప్రధాని ప్రసంగం..

- ముషీరాబాద్, అంబర్‌పేట్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో సుమారు 2 కిలోమీటర్ల పరిధిలో రోడ్ షో కొనసాగనుంది. కాచిగూడ సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి కమలనాథులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. గ్రేటర్ చరిత్రలో ఓ ప్రధాని స్థాయి వ్యక్తి రోడ్ షో నిర్వహించడం అరుదైన అంశంగా చెప్పుకోవచ్చు.

5 వేల మందితో బందోబస్తు..

ప్రధాని మోదీ నగర పర్యటన నేపథ్యంలో పోలీసు విభాగం ఐదు వేల మందితో పటిష్ఠ బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తోంది. ఆయన భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) బ్లూ బుక్ ఆధారంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కేంద్ర, పోలీసు బలగాల అధీనంలో ఉన్న రూట్లను సోమవారం ఎస్పీజీ తమ అధీనంలోకి తీసుకోనుంది. రోడ్ షో జరిగే చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున బలగాలు మోహరించనున్నాయి. బందోబస్తు, భద్రత విధుల్లో ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్, శాంతి భద్రతల విభాగంతో పాటు టాస్క్‌ఫోర్స్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ విభాగాలు, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొంటాయి. ఆదివారం రాత్రి నుంచే నగర వ్యాప్తంగా నిఘా, తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు పెద్ద ఎత్తున మఫ్టీ పోలీసులను మోహరించారు. ఆయా ప్రాంతాల్లో నిర్దేశిత వేళల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. ఈసారి గగనతల నిఘాను సైతం ఏర్పాటు చేశారు. రూఫ్ టాప్ వాచ్ కోసం రోడ్ షో జరిగే మార్గం చుట్టుపక్కల ఎత్తయిన భవనాలపై సుశిక్షితులైన స్నైపర్స్‌ను మోహరిస్తున్నారు.

అప్పట్లోనే అనుకున్నారు కానీ..

- హెచ్ఐసీసీ నోవాటెల్ వేదికగా జులైలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశాలకు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన ముఖ్య మంత్రులు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలంతా హాజరయ్యారు. నిజానికి అప్పట్లోనే హైటెక్ సిటీ నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వరకు రోడ్‌షో నిర్వహించాలని భావించారు. భద్రతాపరమైన కారణాలతో అనుమతి రాలేదు. దీంతో ఆయన నేరుగా పరేడ్‌గ్రౌండ్ వేదికగా నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపు సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు చేరుకోవాల్సి వచ్చింది.
- ఆ తర్వాత బేగంపేటకు చేరుకుని అక్కడే బీజేపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఐఎస్‌బీ పర్యటనకు వచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్బీ స్టేడియం వేదికగా నిర్వహించిన బీసీ సీఎం డిక్లరేషన్ సభలో పాల్గొన్నారు. ఇటీవల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ సభకు హాజరైన మోదీ.. రెండు రోజుల క్రితం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో నగరం నుంచి రాకపోకలు సాగించిన మోదీ.. శ్రీవారి దర్శనార్థం తిరుపతి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం మహబూబాబాద్, కరీంనగర్‌లలో పర్యటించి, సాయంత్రం 4 గంటలకు నగరానికి చేరుకోనున్నారు. ఐదు గంటలకు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌కు చేరుకున్న అనంతరం రోడ్ షోలో పాల్గొంటారు.

ట్రాఫిక్ ఆంక్షలు

సోమవారం ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ నుంచి కాచిగూడ ఎక్స్ రోడ్స్ వరకు ప్రధాని నరేంద్రమోదీ రోడ్డు షో నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 10 గంటల వరకు ఆ రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. బేగంపేట్ ఎయిర్ పోర్టు నుంచి బేగంపేట్, గ్రీన్‌లాండ్స్, పంజగుట్ట, మొనప్ప ఐలాండ్, రాజ్‌భవన్, వీవీ విగ్రహం, నిరంకారీ భవన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, నెక్లెస్ రోటరీ, తెలుగు తల్లి జంక్షన్, కట్టమైసమ్మ ఆలయం, ఇందిరా పార్కు, అశోక్‌నగర్ ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నుంచి చిక్కడపల్లి, నారాయణగూడ, కాచిగూడ క్రాస్ రోడ్స్ వరకు రోడ్ షో ఉంటుంది. ప్రధాని పర్యటన, రోడ్ షో సందర్భంగా ఆయా రూట్లలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాలలోకి మళ్లిస్తామని అదనపు సీపీ వెల్లడించారు.

మిగిలింది రెండు రోజులే

తుది దశకు చేరుకున్న ప్రచారం

- జిల్లాను చుట్టేస్తున్న ముఖ్య నేతలు
- కల్వకుర్తి, ఎల్బీనగర్‌లో యోగి పర్యటన
- నేడు షాద్‌నగర్, చేవెళ్లకు సీఎం కేసీఆర్ రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు



చేవెళ్ల: ముఖ్యమంత్రి ప్రజా ఆశీర్వాద సభకు సిద్ధం చేస్తున్న వేదిక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ప్రచారానికి ఇక రెండు రోజులే మిగిలింది. ఈ నెల 30న పోలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రధాన పార్టీల ముఖ్య నేతలు ఆయా నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలో పర్యటించిన సీఎం కేసీఆర్.. నాలుగు రోజుల క్రితం మహేశ్వరం నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరయ్యారు. శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. శనివారం తుక్కుగూడలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. అదే రోజు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆమనగల్లులో పర్యటించారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. తాజాగా ఆదివారం ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆమనగల్లు, ఎల్బీనగర్‌లో పర్యటించారు. ఆయా నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులు ఆచారి, సామరంగారెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శల వర్షం గుప్పించారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

అభ్యర్థులు ఒకవైపు ముఖ్య నేతలతో భారీ బహిరంగసభలు, రోడ్‌షోలు ఏర్పాటు చేస్తూనే.. మరోవైపు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. పోలింగ్ బూతుల వారిగా ఇన్‌చార్జిలను నియమించారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒకరు ఇన్‌చార్జిగా నియమించి, ప్రతి రోజు వారితో టచ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అంతే కాదు పార్టీల వారీగా కరపత్రాలను ముద్రించారు. పార్టీ గుర్తు, ఎన్నికల ఎజెండా, అభ్యర్థి ఫొటో సహా ఓటరు ఐడీ నంబర్, పోలింగ్ బూత్ నంబర్‌ను ప్రత్యేకంగా ముద్రించి ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. తమకే ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే లక్ష్యంతో మరికొంత మంది అభ్యర్థులు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రచార గడువు ముగిసిన తర్వాత అభ్యర్థులు, ముఖ్య కార్యకర్తలపై మరింత నిఘా పెరిగే అవకాశం ఉండటంతో డివిజన్లు, మండలాలు, గ్రామాలు, వార్డుల వారీగా ఎంపిక చేసిన బాధ్యులు ఓటర్లకు పోలింగ్ స్లిప్పులతో పాటే నగదు, మద్యం బాటిళ్లు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సీ విజిల్ యాప్‌నకు వస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికం ఇలాంటివే ఉండటం గమనార్హం.

సభా ఏర్పాట్ల పరిశీలన

చేవెళ్ల: సీఎం పర్యటన నేపథ్యంలో చేవెళ్లలో ఏర్పాటు చేసిన సభా స్థలిని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ రష్మీ పెరుమాళ్లు, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి శనివారం పరిశీలించారు. వీఐపీ పార్కింగ్, సభకు వచ్చే ప్రజల పార్కింగ్, గ్యాలరీల ఏర్పాట్ల గురించి స్థానిక నేతలను అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం సభా వేదికపైకి వచ్చే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. భద్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ ఉన్నారు.



చేవెళ్ల: సీఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ రష్మీ పెరుమాళ్లు

నేడు షాద్‌నగర్, చేవెళ్లలో ప్రజా ఆశీర్వాద సభలు

షాద్‌నగర్‌లో సోమవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న యాగశాల మైదానంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సభలో పార్టీ అభ్యర్థి అంజయ్య యాదవ్ తరఫున ప్రచారం చేయనున్నారు. అటు నుంచి నేరుగా చేవెళ్ల నియోజకవర్గానికి చేరుకొని మధ్యాహ్నం ఫరా కళాశాల మైదానంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య తరఫున ప్రచారం చేయనున్నారు. సీఎం హాజరవుతున్న సభలకు జనాన్ని భారీగా తరలించేందుకు ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు ఏర్పాట్లు చేశారు. సీఎం రాక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సభాస్థలిని పరిశీలించి, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

'కసిరెడ్డి'.. అదరగొట్టి



ఆమనగల్లు: గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

'కాలె'.. మళ్లీ గెలవాలె



చేవెళ్ల: గ్రామాల్లో ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

'మల్‌రెడ్డి'.. అభిమానానికి అడ్డేది

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



'కిచ్చెన్నగారి'.. గజమాల మరి

మహేశ్వరం: గజమాలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు



'అందెల'.. గెలుపు తలుపు తట్టేలా

మహేశ్వరం: తుమ్మలూరులో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు



నేటినుంచి మైసిగండి జాతర



మైసిగండిలో కొలువైన మైసిగండి మైసమ్మ తల్లి

కడ్తాల్: మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లి జాతర సోమవారం ఉదయం 5 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా ప్రారంభం కానుంది. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు మైసమ్మ తల్లికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అలంకరణ, అభిషేకం, క్షీరాభిషేకం, కుంభహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతరను పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత తెలిపారు.

625 మందికి బైండోవర్

యాచారం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు కోరారు. సాగర్‌రోడ్డుపై మాల్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో 34 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. పాత నేరస్తులు, గత ఎన్నికల సమయాల్లో కేసులు నమోదైన 625 మందిని ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

ముదిరాజ్‌లకు సముచిత స్థానం

- బీఆర్ఎస్ రాష్ట్ర నేత కాసాని
- చేవెళ్లలో ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల: ముదిరాజ్ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని.. అందుకే కారుకు మద్దతిస్తున్నామని ముదిరాజ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. ఆదివారం చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ.. కేసీఆర్ అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ.. అన్ని వర్గాలను గౌరవిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు అండగా నిలుస్తోందని తెలిపారు. యాదయ్యకు ముదిరాజులు మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని ఆకాంక్షించే కేసీఆర్ ముదిరాజ్‌లకు న్యాయం చేస్తారని కాలె యాదయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, నాగారాజు, నర్సింలు, శ్రీకాంత్, గణేశ్, శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులున్నారు.

కారుకు ఓటేస్తేనే సంక్షేమం

మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా సేవకుడిగా అండగా ఉంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తంగడపల్లి, మడికట్టు, తలారం, దుద్దాగు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని, ఇతర పార్టీల అభ్యర్థుల మాటలు నమ్మి ఓటు వేస్తే ఆగమవుతారని సూచించారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చానని గుర్తుచేశారు. సేవకుడిగా పనిచేసే నాయకుడు కావాలా లేక వివాదాలకు కారణమయ్యే నాయకులు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు గ్రామాలు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో గమనించాలన్నారు. తాగునీటి సమస్యను తీర్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400లకే సిలిండర్ అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అనూషగౌడ్, సురేందర్, శేరి శివారెడ్డి, వెంకటేశంగుప్తా, భీమయ్య, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, కిష్టయ్య, ఆయా గ్రామాల నాయకులు నాగార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, వైస్ ఎంపీపీ శివప్రసాద్ పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో కాసాని జ్ఞానేశ్వర్, కాలె యాదయ్య తదితరులు

నిరసన సెగ

తంగడపల్లి, దుద్దాగు గ్రామస్తులు సమస్యలపై యాదయ్యను ప్రశ్నించారు. తమ ఊరికి బస్సు సౌకర్యం లేదని తలారం గ్రామస్తులు నిలదీశారు. ఎన్నికల కోడ్ అనంతరం అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

'గులాబీ' మోసాలను గుర్తించాలి



చేవెళ్ల: మైనార్టీల సమ్మేళనంలో మాట్లాడుతున్న భీంభరత్

- చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం
- ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ చేవెళ్ల అభ్యర్థి భీంభరత్

చేవెళ్ల: గులాబీ నేతల మోసాలను ముస్లిం, మైనార్టీలు గుర్తించి ఓటుతో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాటి నుంచి మైనార్టీలకు అండగా ఉంటుందని గుర్తు చేశారు. అధికార బీఆర్ఎస్ రిజర్వేషన్లు పెంచుతామని చెప్పి హామీని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు వాజిద్, ఫరూక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే పేదలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని పామెన మాజీ సర్పంచ్ డి.గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఇంటింటికీ ప్రచారం చేస్తూ గ్యారెంటీ కార్డులను అందజేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఈ ప్రచారంలో ఎర్రగోపాల్, రాజేందర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, ప్రశాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: భీంభరత్‌కు స్వాగతం పలుకుతున్న చిన్నన్నగూడ గ్రామస్తులు

విజయం ఖాయం

శంకర్‌పల్లి: చేవెళ్ల అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడ, చిన్నన్నగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కె.ఉదయమోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, రవీందర్, సత్యం, నర్సింలు, గోపాల్, రాందాస్, ప్రశాంత్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

హిమాయత్‌నగర్: తమకు చెందిన కోట్ల రూపాయల వ్యవసాయ భూమిని కబ్జా చేసి ముగ్గురు వ్యక్తులను హత్య చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఓ బాధిత కుటుంబం ప్రభుత్వానికి వేడుకుంటుంది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ సంఘటనలపై సీబీఐచే వెంటనే విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తారామతిపేట్ నివాసులు కొరకొక్కుల భూలక్ష్మి, కుమార్తెలు, కొడుకు మాట్లాడుతూ.. తారామతిపేట్‌లో తన తండ్రి మూల స్వామికి చెందిన 200 ఎకరాల భూమిని తమ సమీప బంధువు, స్థానిక సర్పంచ్ మూల మహేశ్ కుటుంబం, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి చలమల కృష్ణారెడ్డి తదితరులు కలిసి తమ భూమిలో అక్రమ లేవుట్లతో కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయాలపై తమ సోదరుడు అంజయ్య హైకోర్టును ఆశ్రయించారు. కబ్జాలను అడ్డుకుంటున్న తమ సోదరుడు అంజయ్య, సోదరుడి కుమారుడు శివ ప్రసాద్‌ను ఆధారాలు లేకుండా హత్య చేశారని ఆరోపించారు. ఈ విషయాలన్నింటిపై సీబీఐచే విచారణ జరిపించాలని 2023 మార్చి 28న హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆమె వివరించారు. వెంటనే సీబీఐచే విచారణ ప్రారంభించి తమకు న్యాయం చేయాలని బాధితురాలు భూలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

36 లీటర్ల మద్యం సీజ్

చేవెళ్ల: అనుమతి లేకుండా రవాణా చేస్తున్న మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత వెల్లడించారు. శంషాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ సూచనల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్, చేవెళ్ల ఎక్సైజ్ టీమ్‌లు శనివారం రాత్రి చేవెళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఓ వ్యక్తి కారులో 36 లీటర్ల మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, మద్యాన్ని, స్వాధీనం చేసుకొని, కారును సీజ్ చేసి.. కేసు నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా మద్యాన్ని తరలించినా.. నిల్వ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

6,764 మంది 'పోస్టల్' వినియోగం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని 6,764 మంది (పీఓ, ఏపీఓ, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు పోలీసు సిబ్బంది) పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీస్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోమవారం వరకు అవకాశం ఉన్నందున వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది (పీఓలు, ఏపీఓలు, పీఓపీలు) 23వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నందున సిబ్బంది ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఓట్ ఫ్రం హోం

ఇంటి నుంచి ఓటు సేకరించే ప్రక్రియను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. గత సోమవారం 20వ తేదీ నుండి ఇప్పటి వరకు జిల్లాలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఇంటి నుంచి ఓటు స్వీకరించే ప్రక్రియ ద్వారా మొత్తం 1,817 మంది అర్హులైన వయో వృద్ధులు, దివ్యంగులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ప్రకటించారు. వారి ఓటును సేకరించేందుకు ప్రత్యేక పోలింగ్ బృందాలు దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించాయని తెలిపారు. దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, కోవిడ్ పాజిటివ్ ఉన్న వారికి భారత ఎన్నికల కమిషన్ ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని చెప్పారు. జిల్లాలోని 8 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు 1,988 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. వారి కోసం ప్రత్యేక ఎన్నికల బృందాలు ఏర్పాటు చేసి ఓటర్ల ఇంటి నుంచి ఓటు హక్కు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకున్న వారు తాము ఏ అభ్యర్థికి ఓటు వేశామనే విషయాన్ని గోప్యంగా ఉంచుతూ, స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పూర్తి గోప్యత ఉండే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసి, బ్యాలెట్ పత్రాలతో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, పోలీసు అధికారులతో కూడిన బృందాలు వెళ్ళి ఓటర్ల నుంచి ఓటు స్వీకరించాయని, ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు స్వీకరించే ప్రక్రియను పూర్తి స్థాయిలో వీడియో రికార్డింగ్ జరిపించామని అన్నారు.

ఓటుకు నోటు

సమీపిస్తున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

- ఊపందుకున్న తాయిలాల పర్వం
- ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న పార్టీలు
- డబ్బు, మద్యం, కానుకల పేరిట మచ్చిక
- గ్రేటర్‌లో దాదాపు రూ.1,500 కోట్ల ఖర్చు
- గెలుపు లక్ష్యంతో వెనుకాడని అభ్యర్థులు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో ప్రలోభాల పర్వం ఊపందుకుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు తాయిలాలను ఎరను ముమ్మరం చేశారు. అన్ని ప్రధాన పక్షాలూ కులాలు, సంఘాలు, అపార్టుమెంట్లు, కాలనీలు తదితర విభాగాల వారీగా నగదు, కానుకల పంపిణీ చేపట్టాయి. మద్యం పార్టీలూ జోరుగా సాగుతున్నాయి. రాత్రిళ్లు గ్రూపులు, కాలనీల వారీగా పార్టీలు ఏర్పాటు చేస్తూ 'గుర్తుంచుకోండి' అంటున్నారు. కాలనీల్లో ఇంటింటికీ వెళ్తున్న మహిళలు సైతం బొట్టుపెట్టి, ముచ్చట్లు చెప్పి.. కానుకలు ఇచ్చి మర్చిపోవద్దు అంటూ వెళ్తున్నారు. చురుగ్గా ఉండే యూత్‌ను మచ్చిక చేసుకొని ఆయా పార్టీల కార్యనిర్వాహకులు తమ టార్గెట్ పూర్తి చేస్తున్నారు. గతంలో మాదిరిగా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులతో సమావేశాలు, యువతకు క్రికెట్ కిట్స్ పంపిణీ వంటివి ఈసారి పెద్దగా లేనట్లు కనిపిస్తోంది. యూపీఐ పేమెంట్ల ద్వారానూ కొన్నిప్రాంతాల్లో పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఒకే నెంబరునుంచి ఎక్కువమందికి వెళ్తే గుర్తిస్తారనే అంచనాతో కొన్ని నెంబర్ల నుంచి కొందరికి పంపిస్తున్నారు.

ఓటర్ల వారీగా..

- ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల నాటి నుంచే వంద మందికో వలంటీర్‌ను ఏర్పాట్లు చేసుకున్నారు. వలంటీర్లు ఇప్పటికే రెండు మూడు పర్యాయలు ఓటర్లతో 'టచ్'లోకి వెళ్లారు. దాంతో ఎవరికేం కావాలో అవి చేస్తున్నారు. పంపిణీలు ఇప్పుడిప్పుడే చేపట్టినవారు ఇబ్బందులు పడుతున్నారు కానీ ఎప్పటినుంచో ఈ ప్రణాళిక అమలు చేస్తున్నవారు నమ్మకంగానే ఉన్నారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల వారీగా పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరైతే తమకంటే ఎదుటివారు ఎక్కువ ప్రలోభపెడుతున్నారా అన్నది ఓ కంట కనిపెట్టే నిఘా బృందాల్నీ ఏర్పాటుచేసుకున్నట్లు తెలుస్తోంది.
- పేదలు ఎక్కువగా ఉండే స్లమ్స్ ప్రాంతాలపై ప్రస్తుతం దృష్టి సారిస్తున్నారు. ఫలానా స్లమ్‌లోని వారు మేమెంత చెబితే అంత అంటూ చోటామోటా నాయకులు బేరాలు పెడుతున్నట్లు సమాచారం.నేతల నుంచి సొమ్ము అందిన వారు పోల్‌చీటీల పంపిణీ పేరిట సైతం ఓటర్ల వద్దకు వెళ్లి ఫలానా వారికి వేయాల్సిందిగా సూచిస్తున్నారు. కొన్ని చోట్ల నగదు కూడా పంపిణీ ప్రారంభమైనట్లు చెబుతున్నారు.

ఆగని పంపిణీ..

అధికారులు ఎన్ని చెక్‌పోస్టులు పెట్టినా,వెళ్లాల్సిన సొమ్ము ఇప్పటికే ముఖ్యుల వద్దకు చేరిందని, ఎన్నికల నాటికి ఓటర్లకు అందేందుకు వివిధ విధానాలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. నగదు, కానుకలు, మద్యం.. ఇలా.. గ్రేటర్‌లో అన్ని పార్టీల నుంచి దాదాపు రూ. 1500 కోట్లు ఖర్చవుతున్నట్లు విశ్లేషకుల అంచనా. గ్రేటర్ శివార్లలోని ఉమ్మడి రంగారెడ్డి నియోజకవర్గాల్లోనైతే కొందరుఅభ్యర్థులు రూ. వందకోట్లకు తగ్గకుండా ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి పెద్దపీట

- బీఆర్ఎస్ షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్య యాదవ్

షాద్‌నగర్: న్యాయవాదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో అడ్వకేట్స్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాదులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్ర సాధన ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. న్యాయవాదుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ఈ ఎన్నికల్లో న్యాయవాదులు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించడం హర్షనీయమని అన్నారు. బార్ అసోసియోషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాద వ్యవస్థను అన్ని విధాలుగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. స్వరాష్ట్రంలో న్యాయవాదులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్స్ రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథ్‌శర్మ, దేశికాచారి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, బాల ప్రసాద్, నర్సింలు, విజయ్ కుమార్, నర్సింలు, శేఖర్, సురేందర్, జయమ్మ, శ్వేత, చంద్రశేఖర్ యాదవ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు మద్దతు తెలిపి సన్మానిస్తున్న న్యాయవాదులు

పట్నాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- మరోసారి అవకాశం కల్పించండి
- బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిపించిన మీరే.. మరోసారి దీవించి సేవ చేసే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం ఆయన మండలంలోని అనాజ్‌పూర్, సంఘీ నగర్, ఉమర్‌ఖాన్‌గూడ, కోహెడ గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు రూ.2,930 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం కల్పిస్తే అన్ని హంగులతో జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. అనంతరం తారమతిపేటకు చెందిన పలువురు మంచిరెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అనాజ్‌పూర్ సర్పంచ్ రంగయ్య ముదిరాజ్, పార్టీ నాయకులు దండెం రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింహముదిరాజ్ పాల్గొన్నారు.



రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి

అధికార మార్పు అవసరం



తుక్కుగూడలో ప్రచారం చేస్తున్న రామచంద్రయ్య యాదవ్

- బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయ్య యాదవ్

తుక్కుగూడ: రాష్ట్రంలో మార్పు కోసమే భారత చైతన్య పార్టీ (బీసీవై) పోటీ చేస్తుందని ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు బి.రామచంద్రయ్య యాదవ్ అన్నారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి కుంభం సురేశ్ యాదవ్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నుంచి సబితారెడ్డి భూకబ్జాలు తప్ప చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. ప్రజలు చెరుకు రైతు గుర్తు పై తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అభ్యర్థి కుంభం సురేశ్ యాదవ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ యాదవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారులోనే యువకుడి సజీవ దహనం

- అర్ధరాత్రి ఔటర్‌పై ఘటన

ఇబ్రహీంపట్నం రూరల్: అర్ధరాత్రి ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు దగ్ధమై యువకుడు సజీవ దహనమయ్యాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా జ్యోతినగర్, నాయనగర్ ప్రాంతానికి చెందిన బడుగుల వెంకటేశ్ (25) శనివారం సాయంత్రం సూర్యపేట నుంచి హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడకు కారులో బయలుదేరాడు. బొంగ్లూర్ సమీపంలోని శ్రీశ్రీ ఎరోలైట్స్ వద్దకు రాగానే కారు ఆపి సీటు వెనక్కి తీసుకొని నిద్రిస్తున్నాడు. అంతలోనే ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అప్పటికే నిద్రలో ఉన్న వెంకటేశ్ కారులోనే ఉండిపోయాడు. పెద్ద ఎత్తున మంటలు వస్తున్నాయని అర్ధరాత్రి 1.20 గంటలకు ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే కారులో ఉన్న వెంకటేశ్ మంటల్లో సజీవ దహనం అయ్యాడు. క్లూస్ టీం సహకారంతో కారు నంబర్ గుర్తించారు. అందులో ప్రయాణిస్తున్నది బడుగుల వెంకటేశ్(25)గా నిర్ధారించారు. వెంకటేశ్ కొద్ది రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం కెనడాకు వెళ్లనున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నారు. మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు చెప్పినట్లు వెల్లడించారు.